నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 5 సెప్టెంబర్ 2024 | RANGAREDDY



షాద్‌నగర్ మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు కలిపి ఒకే టీచర్ బోధన



శివసాగర్ ప్రాజెక్ట్

**జిల్లాలో మొదటి విడుతలో 762 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు**

**రూ.22.30 కోట్లు మంజూరు... అమ్మ ఆదర్శ కమిటీలకు నిర్వహణ బాధ్యతలు..**

**ఇప్పటివరకు 358 పాఠశాలల్లోనే పనులు పూర్తి**

**నత్తనడకన సా..గుతున్న పనులు**

# పేరుకే ఆదర్శం.. పనుల్లో ఆలస్యం



శంకర్‌పల్లి మండలంలోని హుస్సేన్‌పూర్ పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

రంగారెడ్డి, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్కూళ్లు తెరిచే నాటికి పనులను పూర్తి చేయాల్సి ఉండగా.. ఎంపిక చేసిన వాటిల్లో సగం పాఠశాలల్లో కూడా నేటికీ పనులు పూర్తి కాలేదు. పనులు జరుగుతున్న తీరును చూస్తే.. పూర్తిస్థాయిలో పనులు అయ్యేసరికి పుణ్యకాలం గడుస్తుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చాలా పాఠశాలల్లో సదుపాయాల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా.. అమ్మ ఆదర్శ పనుల్లో నెలకొన్న జాప్యం కారణంగా విద్యార్థులు ఈ ఏడాది ఆసాంతం సమస్యల నడుమే చదువులను కొనసాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సరైన పర్యవేక్షణ లేక ఈ దుస్థితి నెలకొన్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### సా..గుతున్న సదుపాయాల పనులు..

జిల్లాలో మొత్తం 1,342 పాఠశాలలు ఉండగా.. మన ఊరు-మన బడి, పీఎం శ్రీ పథకాల కింద ఎంపిక కాకుండా మిగిలిపోయిన ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 762 పాఠశాలలను ఎంపిక చేశారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను గత విద్యాసంవత్సరం చివరలోనే అధికారులు గుర్తించారు. ప్రధానంగా పాఠశాలల్లో ఐదు రకాల సమస్యలు నెలకొన్నట్లు గుర్తించి ఆయా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. భవనాలకు మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సమస్యలతోపాటు బాలికలకు మరుగుదొడ్లు లేని చోట పనులు చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేశారు. ఇప్పటివరకు 358 స్కూళ్లలోనే పనులు పూర్తయ్యాయి. మిగతా వాటిల్లో అంతంత మాత్రంగానే కదలిక ఉన్నట్లు తెలుస్తున్నది. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే పనుల్లో జాప్యం నెలకొంటున్నట్లు తెలుస్తున్నది. కొన్ని పాఠశాలల్లో గోడలు దెబ్బతినడం, మరికొన్నింటిలో పై కప్పులు శిథిలావస్థకు చేరడంతో వానకాలంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్యవేక్షణ కొరవడడం వల్లనే పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికే అన్ని పనులను పూర్తి చేయాల్సి ఉండగా.. నేటికీ కొనసాగుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమిని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

### అటకెక్కిన 'మన ఊరు-మన బడి' పనులు..

రంగారెడ్డి జిల్లాలో 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు తీసుకొచ్చింది. ఈ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 468 పాఠశాలలు ఎంపికకాగా.. 448 పాఠశాలలకు రూ.97.88కోట్ల అంచనా వ్యయంతో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులను ఇచ్చింది. దాదాపు 65 పాఠశాలల్లో పనులు పూర్తికాగా పాఠశాలలను పునః ప్రారంభించారు. పలుచోట్ల పనులు అసంపూర్తి దశలోనే ఉన్నాయి. బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం జాప్యం చేస్తున్న కారణంగానే కాంట్రాక్టర్లు మిగిలిపోయిన పనుల పూర్తికి శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వం సైతం గత ప్రభుత్వ పనులపై పర్యవేక్షణ గాలికి వదిలేసింది. దీంతో మన ఊరు-మన బడిలో చేపట్టాల్సి ఉన్న పనులు అటకెక్కినట్లేనన్న ప్రచారం జరుగుతున్నది.

# నీరున్నా..నిష్ఫలం

**మరమ్మతులు పూర్తి కాక అందని సాగునీరు**

**చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోని అధికారులు**

**జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా 21,554 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుందని అధికారుల లెక్కలు**

**తూములు, కాల్వలు పాడైనా పట్టించుకోని ప్రభుత్వం**

**కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించినా.. నిధుల మంజూరుకు ఇప్పటికీ లభించని మోక్షం**

వికారాబాద్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నదన్న చందంగా తయారైంది జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి. చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు పేరుకే ప్రాజెక్టులుగా మారాయి. ఆయా ప్రాజెక్టుల్లో నిండా నీరున్నా ఒక్క ఎకరాకు కూడా సాగు నీరందించే పరిస్థితి లేకపోవడం గమనార్హం. జిల్లాలో ఎనిమిది చిన్న, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ సంబంధిత ప్రాజెక్టుల నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. వర్షాలు సమృద్ధిగా పడి చెరువులు, ప్రాజెక్టులు నిండినప్పటికీ ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరందించలేని పరిస్థితి దాపురించింది. ఏటా జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీరందుతుందని కాకి లెక్కలు చూపిస్తున్నా.. వాస్తవానికి మాత్రం ఒక్క ఎకరాకు కూడా సాగునీరందడం లేదు. ప్రాజెక్టులకు సంబంధించి తూములు, కాల్వలు పూర్తిగా దెబ్బతినడంతో ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరున్నా రైతులు తమ పొలాల సాగుకు వాడుకోలేని దుస్థితి నెలకొన్నది. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టు అయిన కోట్‌పల్లిలో ఏటా నీటి నిల్వలు సరిపోను ఉన్నప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథా అవుతున్నది. 50 ఏండ్ల కింద నిర్మించిన కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడం, బ్రిడ్జిలు కూలిపోవడంతో కోట్‌పల్లి ప్రాజెక్టులో నీరున్నా ఆయకట్టుకు సాగునీరందించని పరిస్థితి నెలకొన్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు నిధులివ్వడంతో అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి అధికారులు అందజేసిన అనంతరం మంజూరు దశలో ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ ఊసే లేదు. ఇప్పటికే అంచనాలు పూర్తి చేసి సంబంధిత శాఖ ఈఎన్సీ వద్ద ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ ఫైల్ ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కదలిక తీసుకురాకపోవడంలో వైఫల్యంపై విమర్శలు వెలువడుతున్నాయి.

### ప్రాజెక్టుల కింద 21,554 ఎకరాల ఆయకట్టు..

జిల్లాలోని కోట్‌పల్లి, లక్నాపూర్, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, నందివాగు, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్టిపల్లి ప్రాజెక్టులు ఉన్నాయి. సంబంధిత ప్రాజెక్టుల ద్వారా 21,554 ఎకరాలకు ఆయకట్టు ఉన్నదని జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా 9200 ఎకరాలు, సర్పన్‌పల్లి ప్రాజెక్టు ద్వారా 3285 ఎకరాలు, నందివాగు ప్రాజెక్టు కింద 1900 ఎకరాలు, జుంటుపల్లి ప్రాజెక్టు కింద 2082 ఎకరాలు, శివసాగర్ ప్రాజెక్టు కింద 1000 ఎకరాలు, అల్లాపూర్ ప్రాజెక్టు కింద 1414 ఎకరాలు, కొంశెట్టిపల్లి ప్రాజెక్టు ద్వారా 1073 ఎకరాలు, లఖ్నాపూర్ ప్రాజెక్టు కింద 2469 ఎకరాల ఆయకట్టు ఉన్నదని ఇరిగేషన్ అధికారులు లెక్కలు చెపుతున్నా.. ఒక్క ఎకరాకు కూడా సాగునీరందించలేని దుస్థితి నెలకొన్నది. జిల్లాలోని ప్రాజెక్టులు, ప్రధాన చెరువుల నుంచి వెళ్లే కాల్వలు పూర్తిగా పాడై సాగు నీరందించే పరిస్థితి లేదు. అధికారులు సంబంధిత ఆయకట్టుకు సాగునీరదించే దిశగా ఆలోచించకపోవడం శోచనీయం. ఏటా ప్రాజెక్టుల ఆయకట్టు పేపర్‌కే పరిమితమవుతున్నది. ప్రాజెక్టుల నిర్వహణను కూడా అధికారులు గాలికి వదిలేయడంతో సంబంధిత ప్రాజెక్టుల కాల్వలు, తూములు పూర్తిగా దెబ్బతిన్నాయి. సర్పన్‌పల్లి, శివసాగర్, లక్నాపూర్ ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగు నీరందించడం ఏమోకాని సంబంధిత ప్రాజెక్టుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు ఆక్రమణలకు గురైనా జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టుకు ఆనుకొని వెలిసిన రిసార్ట్‌ల నిర్వాహకులు చెరువులో బోటింగ్ దందా చేస్తూ ఒక్క చుక్క నీటిని కూడా వదలనివ్వ కుండా అక్రమ వ్యాపారం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 7 గ్రామాలకే అందుతున్న సాగునీరు..

జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన కోట్‌పల్లి ప్రాజెక్టుకు గత రెండు, మూడేండ్లుగా భారీగా వరద వస్తుండడంతోపాటు సంబంధిత ప్రాజెక్టు కింద ఉండే కాల్వలన్నీ కొట్టుకుపోవడంతో తక్కువ విస్తీర్ణంలో సాగు నీరందిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోని 18 గ్రామాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, కాల్వలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడంతో కేవలం 7 గ్రామాలకు మాత్రమే సాగునీరందిస్తున్నారు. గతేడాది తూములు, కాల్వలు వరదకు కొట్టుకుపోవడంతో ఒక్క ఎకరాకు కూడా సాగునీరందించలేకపోయారు. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా రుద్రారం, గట్టేపల్లి గ్రామాలకు, కుడి కాల్వ ద్వారా నాగసముందర్, మాన్‌సాన్‌పల్లి, జనగాం, మంబాపూర్, మారెపల్లితండా గ్రామాల పరిధిలోనే సాగు నీరందిస్తున్నారు. 1.57 టీఎంసీల సామర్థ్యం గల కోట్‌పల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా కాల్వలు పూర్తిగా కొట్టుకుపోవడం, దెబ్బతినడంతో రైతులకు నష్టం జరుగకూడదనే లక్ష్యంతో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో గత ప్రభుత్వం వెంటనే జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాష్‌తోపాటు అధికారుల బృందాన్ని పంపి ఏయే పనులు చేపట్టాలనే సమగ్ర నివేదికను అందజేయాలని సూచించడంతోపాటు తదనంతరం కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. రూ.110 కోట్ల నిధులతో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణతో పాటు ఆనకట్ట బలోపేతం, కుడి, ఎడమ, బేబి కాల్వల పునర్నిర్మాణం, కాల్వల పునర్నిర్మాణం, పాత బ్రిడ్జిల స్థానంలో కొత్త బ్రిడ్జిలను నిర్మించడం తదితర మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలను తయారు చేశారు. తదనంతరం ఎన్నికలు రావడంతో పెండింగ్‌లోనే ఉండిపోయింది. అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జిల్లాలో ఉన్న ఒకే ఒక్క మధ్యతరహా ప్రాజెక్టుకు కూడా నిధులివ్వడంపై దృష్టి సారించడం లేదు. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా 9200 ఎకరాలకు(కుడి కాల్వ ద్వారా 8100 ఎకరాలు, ఎడమ, బేడి కాల్వ ద్వారా 1100 ఎకరాలకు) సాగు నీరందించే సామర్థ్యం ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తైతే 15 వేల ఎకరాలకుపైగా సాగు నీరందించే అవకాశాలు ఉన్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

# నష్టం అంచనా నివేదికను సమర్పించండి

**పంట, ఆస్తి నష్టం వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక**



అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలను వెంటనే సమర్పించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు కారణంగా జిల్లాలో జరిగిన ఆస్తి, ప్రాణ, పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నివేదికలను రూపొందించాలని తెలిపారు. టెంపరరీ పునరుద్ధరణ నివేదికను కూడా సమర్పించాలన్నారు. వర్షాలు పడినప్పుడు వాగులు, చెరువులు ఉప్పొంగినప్పుడు చోటుచేసుకున్న సంఘటనలు వివరాలు సమర్పించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండి పరిస్థితులు పరిశీలించాలని ఆదేశించారు. వర్షాలకు రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగే వాటిని గుర్తించాలని, అక్కడ అధికారులను నియమించి ఎలాంటి ప్రమాదాలు, ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా నివారించడానికి కృషి చేయాలని సూచించారు. వరదల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించేందుకు పునరావాస కేంద్రాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, డీపీవో సురేశ్‌మోహన్, సీపీవో సౌమ్య, వ్యవసాయ అధికారి నర్సింహా రావు, ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# భూగర్భ జలాల పెంపునకు వాటర్‌షెడ్ పనులు చేపట్టాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 4 : వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడానికి వాటర్‌షెడ్ పనులను విస్తృతంగా చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని బీఆర్‌ఎల్‌ఎఫ్ కేంద్ర బృందం సందర్శించింది. గ్రామం పరిధిలో ఉన్న భూముల్లో వాటర్‌షెడ్ పనులు చేపట్టడానికి అనువైన స్థలాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రజలతో వారు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ఎత్తు నుంచి పల్లానికి పారే వర్షపు నీటిని ఒడిసి పట్టడానికి రైతుల పొలాలు, కమ్యూనిటీ ప్రదేశాలలో చెక్‌డ్యాంలు, పాంపండ్స్, వాలు కట్టలు, చెరువులు, కుంటల్లో పూడిక తొలగింపు వంటి పనులను చేపట్టాలని సూచించారు. వాటర్‌షెడ్ కార్యక్రమాలు చేపట్టడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతున్నదని భూగర్భ జలాలు పెరిగి బోర్లతో వ్యవసాయం చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. అంతకు ముందు రైతులు ఎలాంటి పంటలు వేసుకుంటారు, నీటి వినియోగం తదితర విషయాల గురించి కలెక్టర్‌తో పాటు బీఆర్‌ఎల్‌ఎఫ్ ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎల్‌ఎఫ్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ సమిత్‌రాయ్, రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్ తివారీ, ఏపీడీ సరళ, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఎంపీవో మహేష్, ఏపీవో మల్లికార్జున్, టీఏలు, ఎఫ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్




సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

# విలీనంపై విముఖత

**ఘాన్సీమియాగూడ గ్రామస్తుల వినతి**

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 4 : 'మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయవద్దు' అంటూ.. ఘాన్సీమియాగూడ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేస్తే అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. గ్రామస్తులకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, ప్రత్యేకాధికారి వాల్యానాయక్ కలిసి మున్సిపాలిటీలో విలీనం కోసం తీర్మాన పత్రాలను ఉన్నతాధికారులకు అందించినట్లు వివరించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో కనీసం గ్రామసభ ఏర్పాటు చేసి.. ప్రజలకు తెలుపాల్సిన అధికారులు ఎవరికీ తెలియకుండా తీర్మానం పంపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా తీర్మాన పత్రాలను పంపిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఘాన్సీమియాగూడను మున్సిపాలిటీలో విలీనం చేయకుండా గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయత్‌రాజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తామన్నారు. సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో చిలకమర్రి మహేందర్, ఆనంద్ ముదిరాజ్, ఇమ్రాన్, రవీందర్‌గౌడ్, మల్లేశ్, నందం, రాజు, సురేశ్‌గౌడ్, ప్రభు తదితరులు ఉన్నారు.

# మార్కెట్లోకి నకిలీ డీ-కాల్షియం మాత్రలు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): చైనాకు చెందిన గ్జిన్హా ఫార్మస్యూటికల్ కంపెనీ పేరుతో రాష్ట్రంలోని మార్కెట్లో నకిలీ డీ-కాల్షియం పాంటొథెనేట్ మాత్రలు చెలామణి అవుతున్నాయని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. వాస్తవానికి గ్జిన్హా ఫార్మస్యూటికల్ కంపెనీ పేరుతో ఎలాంటి డ్రగ్ తయారు కాలేదని, అసాంఘిక శక్తులు సదరు కంపెనీ పేరుతో నకిలీ ఔషధాలను తయారు చేసి ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు గ్జిన్హా ఫార్మ కంపెనీ పేరుతో మార్కెట్లో చలామణి అవుతున్న డీ-కాల్షియం ఔషధాలను వినియోగించవద్దని, వీటి అమ్మకాలను సైతం వెంటనే నిలిపివేయాలని అన్ని ఫార్మా ఏజెన్సీలు, షాపులను ఆదేశించారు.

**జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు**

# 170 మంది ఎంపిక

**నేడు జిల్లా పరిషత్ కార్యాలయంలో పురస్కారాలను ప్రదానం చేయనున్న మంత్రి శ్రీధర్ బాబు**

**రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికైన గెజిటెడ్ హెడ్ మాస్టర్ ఎస్కే తాజ్ బాబు**

రంగారెడ్డి, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి 170 మందిని ఎంపిక చేశారు. 10 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను, ఇద్దరు ప్రిన్సిపాల్స్‌ను, 8 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను, 68 మంది స్కూల్ అసిస్టెంట్లను, 65 మంది ఎస్జీటీలను, ఒకరు కస్తూర్బాగాంధీ పాఠశాల స్పెషల్ అధికారిని, 13 మంది ప్రైవేటు ఉపాధ్యాయులను, ముగ్గురు నోడల్ అధికారులను పురస్కారానికి ఎంపిక చేసినట్లు డీఈఓ సుశీంధర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డీఈవో తెలిపారు. రాష్ట్ర స్థాయి పురస్కారానికి రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం జడ్పీహెచ్‌ఎస్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ ఎస్కే తాజ్ బాబు ఎంపికయ్యారు. రవీంద్ర భారతిలో గురువారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో తాజ్‌బాబుకు సీఎం రేవంత్‌రెడ్డి అవార్డును అందజేయనున్నారు.

## కందనెల్లి నుంచి రాష్ట్రస్థాయికి..



పెద్దేముల్, సెప్టెంబర్ 4 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అవార్డులకుగాను పెద్దేముల్ మండలం కందనెల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పని చేస్తున్న కుర్వ సత్యం ఎంపికయ్యారు. తన గ్రామం పేరు వడిచర్లతో ప్రఖ్యాతి పొంది శ్రీపద కలం పేరుతో మణిపూసలు అనే నూతన ప్రక్రియకు ప్రాణం పోసిన సత్యం అనతికాలంలోనే పదికి పైగా పుస్తక రచనలు చేసి పలు సత్కారాలను పొందారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై పీఆర్‌టీయూ నాయకులు, సహచర ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.